ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప జిల్లా వార్తలు
ఆదివారం 24 ఆగస్టు 2025



వారి అభిమతం.. పర్యావరణ హితం



పాలెంపల్లె గ్రామం మట్టి గణపయ్యలకు ప్రసిద్ధి. దాదాపు మూడు దశాబ్దాలుగా ఈగ్రామస్థులు ప్రతి ఏటా మట్టితో వినాయకుడి విగ్రహాలను తయారు చేసి అమ్ముతున్నారు. ఇంటిల్లిపాదీ బొమ్మల తయారీతో తమకు ఉపాధి వెదుక్కుంటూనే పర్యావరణ హితానికీ దోహదపడుతున్నారు. అందరూ మట్టి విగ్రహాలనే వాడండి అని చెప్పే ప్రభుత్వం.. వాటి తయారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న పాలెంపల్లె కళాకారులను ఆదుకోవాల్సి ఉంది.





కడప కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని 50వ డివిజన్‌కు చెందిన పాలెంపల్లె గ్రామం మట్టి గణపయ్య విగ్రహాల తయారీ కేంద్రంగా పేరుగాంచింది. ఆ గ్రామంలో దాదాపు 150కి పైగా కుటుంబాలుండగా వాటిలో 70 కుటుంబాలు ప్రతీ ఏటా వినాయక చవితి పర్వదినానికి మట్టితో గణపయ్య విగ్రహాలను తయారు చేసి అమ్ముతుంటారు. కాలుష్య భూతం నుంచి పర్యావరణాన్ని కాపాడాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని గౌరవిస్తూ మట్టి విగ్రహాలను తయారు చేసి సరసమైన ధరలకే అమ్మకాలు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో వివిధ ఆకృతులలో చూడగానే ఇట్టే ఆకర్షించేలా తయారు చేసిన గణపయ్యలను మార్కెట్‌లో అమ్మకాలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. పాలెంపల్లె గ్రామస్థులు మాత్రం దానిజోలికి పోకుండా మట్టి గణపయ్యలనే తయారు చేసి అమ్ముతుండటం విశేషం.

మూడు నెలల ముందునుంచే..

చవితి పర్వదినానికి మూడు నెలల ముందు నుంచే నగర పరిధిలోని కనుమలోపల్లె, చలమారెడ్డిపల్లె ప్రాంతాల నుంచి అనువైన మట్టిని ఒక్కో ట్రాక్టర్ రూ.5వేలతో తెప్పించుకుంటారు. చిన్న బొమ్మలతో పాటు పెద్ద పెద్ద వినాయకుడి బొమ్మలు సిద్ధం చేస్తుంటారు. ఒక్కో కుటుంబంలోని వారంతా కలిసి చవితి పండుగకు 1,000 నుంచి 1,500 వరకూ వినాయకుడి బొమ్మలు తయారుచేస్తారు. బొమ్మ సైజును బట్టి ఒక్కో విగ్రహాన్ని రూ.30 నుంచి ఆపైన ధరకు అమ్ముతున్నారు. వినాయకుడి పండుగ అయిపోగానే మిగిలిన మట్టితో బానలు, తొట్లు, కడవలు, కుండలు, హుండీలు తయారు చేసి విక్రయిస్తుంటారు.

ఇతర ప్రాంతాలకూ సరఫరా

పాలెంపల్లెలో తయారయ్యే మట్టి విగ్రహాలకు డిమాండ్ ఎక్కువ. ఇక్కడికి కడప, అన్నమయ్య జిల్లాల్లోని కోడూరు, రాజంపేట, మదనపల్లె, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాయచోటి, పీలేరు, తదితర ప్రాంతాల నుంచే కాకుండా.. నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, తిరుపతి జిల్లాల నుంచి కూడా చిన్నచిన్న లారీలు, ఆటోలు, ట్రాక్టర్లలో వచ్చి విగ్రహాలను తీసుకెళ్తుంటారు. డిమాండ్‌ను బట్టి ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తుంటారు.

● దశాబ్దాలుగా మట్టి విగ్రహాల తయారీ







మూడు నెలల శ్రమ..

వినాయక చవితికి మట్టి గణపయ్య విగ్రహాలను అమ్మేందుకు మూడు నెలలుగా విగ్రహాలను తయారు చేస్తున్నాం. పండుగ రోజున విగ్రహాల అమ్మకంపై మా బతుకులు ముడిపడి ఉన్నాయి. మూడు నెలలుగా శ్రమించిన కష్టానికి ఫలితం దక్కుతుందనే నమ్మకంతో కుటుంబం మొత్తం బొమ్మలను తయారు చేస్తున్నాం.

- రంగనాయకులు, పాలెంపల్లె



మట్టి కోసం ఇబ్బంది ఉంది..

మేము మట్టితో మాత్రమే గణపయ్యలను తయారు చేస్తున్నాం. అయితే వినాయకుడి విగ్రహాల తయారీకి అనువైన మట్టి దొరకడం కాసింత ఇబ్బందికరంగా ఉంది. గతంలో లాగా మట్టి దొరికేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఒక్కో ట్రాక్టర్ మట్టి నాలుగువేల నుంచి ఐదు వేల రూపాయల ధర పలుకుతోంది.

- రమ, పాలెంపల్లె



వక్ఫ్‌భూముల సాగుకు 26న వేలం : డీఆర్వో

కడప కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడప డివిజన్ పరిధిలో ఉన్న వక్ఫ్ బోర్డు భూములను 3 సంవత్సరాల సాగుకు సంబంధించి గుత్తకు ఇచ్చేందుకు 26వ తేదీన వేలం నిర్వహిస్తున్నామని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే రైతులు అడ్వాన్స్‌గా రూ.10 వేలు చెల్లించాలని తెలిపారు. వేలంలో భూములు దక్కించుకున్న వారు వెంటనే గుత్త మొత్తం చెల్లించి రసీదు పొందాలని తెలిపారు. ప్రొద్దుటూరు మోడంనల్లి మసీదుకు సంబంధించి తల్లమాంబపురంలో ఉన్న భూములకు, పెండ్లిమర్రి మండలం గంగనపల్లి, ముదిరెడ్డి పల్లి గ్రామం మసీద్ భూములకు, పులివెందుల మండలం పోలేపల్లిలో ఉన్న భూములకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు వేలం జరుగుతుందని, ఆసక్తిగల వారు పాల్గొనాలని డీఆర్వో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మెగా డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

● జోన్-4లో భాగ్యలక్ష్మికి ప్రథమ ర్యాంక్



భాగ్యలక్ష్మి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ రాత పరీక్ష మెరిట్ జాబితా శుక్రవారం రాత్రి విడుదల చేశారు. ఐదారు రోజులుగా తర్జనభర్జన పడిన పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాల వారీగా మెరిట్ జాబితాలను రూపొందించారు. ఆ జాబితాలు జిల్లాలకు పంపనున్నారు. అదే సమయంలో వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు. డీఎస్సీ రాత పరీక్షలో వచ్చిన మార్కులు, టెట్‌లో వచ్చిన మార్కులను కలిపి మెరిట్ జాబితా తయారుచేశారు. దీనిలో ఏవైనా తప్పులున్నాయా అన్నది ఒకటికి రెండుసార్లు సరిచూసి మరీ జాబితాను రూపొందించారు. ఉమ్మడి కడప జిల్లాలో అన్ని కేటగిరీలకు కలిపి 712 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేశారు. ఈ పోస్టుల భర్తీకి ఇప్పటికే జిల్లా అధికారులు రోస్టర్ పాయింట్లు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపారు. దీని ఆధారంగానే జిల్లాలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారని అంచనా వేస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం కడప నగరం ఎస్ఈ ఇంజనీరింగ్ కళాశాల ఎంపిక చేశారు.

భాగ్యలక్ష్మికి సోషల్‌లో ప్రథమ ర్యాంక్

దువ్వూరు మండలానికి చెందిన అప్పల్‌రెడ్డి భాగ్యలక్ష్మి స్కూల్ అసిస్టెంట్ (సోషల్)లో 84.63 మార్కులు సాధించి జోన్-4లో ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకున్నారు. ఈమె భర్త సునీల్‌కుమార్‌రెడ్డి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఈమె ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకొని డీఎస్సీలో ప్రథమ స్థానం సాధించడం విశేషం.

వెరిఫికేషన్‌కు ఇవి తప్పనిసరి

మెగా డీఎస్సీ-2025 అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కడప నగరంలోని బాలాజీనగర్ ఉన్న ఎస్ఈ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. వెరిఫికేషన్ తేదీని త్వరలో తెలుపుతారు. అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే ముందు ఇవి తప్పనిసరిగా అనుసరించాలి. వివిధ కేటగిరీ పోస్టులకు గాను జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ద్వారా కాల్ లెటర్లు అందజేస్తారు. కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని అందులో పేర్కొన్న సూచనలు అనుసరించాలి. కాల్ లెటర్లు పొందిన అభ్యర్థులు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, పోస్టులకు సంబంధించిన అర్హతల ఆధారంగా ఒరిజినల్ సర్టిఫికెట్ల స్కాన్డ్ కాపీలను తయారు చేసుకోవాలి. అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌లో అవసరమైన సర్టిఫికెట్ల స్కాన్డ్ కాపీలన్నీ వెరిఫికేషన్‌కు రాకముందే అప్‌లోడ్ చేసుకోవాలి. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లు 3 సెట్లు నకలు కాపీలను చేసుకొని గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకోవాలి. తమ వెంట 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలను తెచ్చుకోవాలి. గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించిన మూడు సెట్ల నకలు కాపీలను, ఐదు ఫొటోలను ఒక ఫైల్ ఫోల్డర్‌లో ఉంచుకొని హాజరుకావాలి.

ఒకే ఇంట్లో ముగ్గురికి..



సయ్యద్ సనావుల్లా

చాపాడు/కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఏకంగా ముగ్గురికి టీచర్ ఉద్యోగాలు రావడం విశేషం. పెండ్లిమర్రి మండలంలోని గంగనపల్లెకు చెందిన సయద్‌సనావుల్లా, అతని భార్య నజీహాకరీం, సనావుల్లా చెల్లెలు కూడా రేష్మా ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం సనావుల్లా ఇప్పటికే ఉర్దూ ఎస్జీటీగా చాపాడు మండలంలో పనిచేస్తుండగా, ఉర్దూ ఎస్ఏ ఫిజిక్స్‌లో జిల్లా మొదటి ర్యాంక్ వచ్చింది. ఆయన భార్య నజీహా కరీం ఎస్జీటీ ఉర్దూ విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకున్నారు.

రోజుకు 15 గంటలు చదివా

2018లో ఎస్జీటీగా ఉద్యోగం సంపాదించుకున్నా. ఏడు సార్లు బ్యాంకు ఉద్యోగాలకు, ఒకసారి ఎస్ఐ ఉద్యోగానికి, మరోసారి ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు పరీక్షలు రాసి ఉత్తీర్ణత కాలేకపోయా. అయినా నిరాశపడకుండా ఈ సారి డీఎస్సీ రాసి ఫిజిక్స్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా మొదటి ర్యాంకు సాధించా. డీఎస్సీకి నోటిఫికేషన్ రాగానే ఎండు నెలల పాటు రోజుకు 15గంటలు చదివా. మా అమ్మానాన్న హసీనా, అమీర్‌బాష టైలరింగ్ చేస్తారు. మాది చాలా పేద కుటుంబం. రేయింబవళ్లు అమ్మానాన్న పనిచేసేవారు. మా ఇంటిలో ముగ్గురికి ఉపాధ్యాయ ఉద్యోగాలు రావడం చాలా సంతోషంగా ఉంది.

- సయ్యద్ సనావుల్లా, ఎస్ఏ, జిల్లా ఫస్ట్ ర్యాంకు

భార్యాభర్తకు ఉద్యోగాలు



కారు తేజస్విని (ఎస్జీటీ)



అంబవరం శేఖర్ (ప్రిన్సిపాల్)

పోరుమామిళ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఒకే ఇంట్లో భార్యాభర్తలకు ఉద్యోగాలకు అర్హత సాధించారు. భర్త అంబవరం శేఖర్ ప్రిన్సిపాల్‌గా భార్య కారు తేజస్విని ఎస్జీటీగా అర్హత సాధించారు. శనివారం విడుదలైన డీఎస్సీ మెరిట్ ఫలితాల్లో పోరుమామిళ్ల రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గిరినగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు కారు విజయబాబు కుమార్తె కారు తేజస్వి ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె భర్త అంబవరం శేఖర్ ప్రిన్సిపాల్ పోస్టుకు ఎంపికయ్యారు. ఆయన కాశినాయన మండలం రెడ్డికొట్టాలకు చెందిన వారు. ప్రస్తుతం ఆయన అన్నమయ్యజిల్లా గ్యారంపల్లె ఏపీఎస్ ఆర్జేలో జూనియర్ కెమిస్ట్రీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

అక్కాచెల్లెళ్లకు..



ఐదు ఉద్యోగాలు సాధించిన మెహతాజ్



రేష్మ

పోరుమామిళ్ల మండలంలోని మహబూబ్‌నగర్‌కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు ఖాదర్‌బాషా కుమార్తెలు మెహతాజ్, రేష్మా డీఎస్సీ మెరిట్ ఫలితాల్లో అర్హత సాధించారు. మెహతాజ్ జిల్లాలో రెండోస్థానంలో నిలిచారు. ఆమె ఐదు పోస్టులకు అర్హత సాధించారు. ఎస్జీటీ, ఎస్ఏ (తెలుగు), ఎస్ఏ(సోషల్), టీజీటీ (తెలుగు), టీజీటీ (సోషల్) ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టీటీసీ, బీఈడీ చేయడంతో ఐదు పోస్టులకు పరీక్షలు రాశారు. ఐదింటిలోనూ అర్హత సాధించారు. అయితే ఎస్ఏ(సోషల్) టీచర్‌గా పనిచేస్తానని మెహతాజ్ తెలిపారు.

ఉప్పలూరులో భార్యాభర్తకు..


కాశినాయన, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన పాలకొలను సుబ్బారెడ్డి ఫిజిక్స్‌లో 77.79 మార్కులతో జిల్లా 3వ ర్యాంక్, అతని భార్య వనిపెంట శ్రీలత ఫిజిక్స్‌లో 75.27 మార్కులతో 13వ ర్యాక్ దక్కించుకున్నారు. ప్రస్తుతం సుబ్బారెడ్డి ఖాజీపేటలో ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేస్తుండగా శ్రీలత సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో టీచర్‌గా ఉన్నారు.



శ్రీలత, సుబ్బారెడ్డి దంపతులు

ముగిసిన శ్రావణమాసోత్సవాలు

● గండికి పోటెత్తిన భక్తులు ● వైభవంగా గ్రామోత్సవం





ప్రత్యేక అలంకరణలో గండి వీరాంజనేయస్వామి.. గండి క్షేత్రానికి భారీగా వచ్చిన భక్తులు

చక్రాయపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఐదవ శ్రావణ శనివారం గండి వీరాంజనేయస్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఉదయం కొద్దిగా తక్కువగా వచ్చినప్పటికి మధ్యాహ్నం నుంచి భారీ ఎత్తులో భక్తులు అంజన్న దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. వచ్చే భక్తుల కోసం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్, ఉత్సవ కమిటీ సభ్యుడు కల్లూరు వెంకటస్వామి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు అత్యంత వైభవంగా దేవాలయాన్ని పూలతో అలంకరణ చేశారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. గండి వీరాంజనేయస్వామిని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దర్శించుకున్నారు. భక్తులకు 23వేల ప్రసాదాలు, 23వేల పులిహోర పంపిణీ చేశారు. సాయంత్రం 4గంటల నుంచి భారీ ఎత్తున భక్తులు గండికి చేరుకున్నారు. వివిధ రకాల టికెట్ల ద్వారా గండికి దాదాపు రూ.23లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. వేంపల్లె వైపు నుంచి వచ్చే భక్తులకు వీరన్నగట్టుపల్లె వద్ద, చక్రాయపేట వైపు నుంచి వచ్చే భక్తులకు అద్దాలమర్రి క్రాస్ వద్ద వేంపల్లె నారాయణ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి ఎనిమిది బస్సులు ఏర్పాటుచేశారు. సాయంత్రం వీరాంజనేయస్వామికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, బ్యాండ్ మేళాలతో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలను శనివారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో కలిసి ఉపకులపతి మాట్లాడుతూ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ ఐదు సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభమై 14వ తేదీకి ముగిశాయన్నారు. ఈ పరీక్షలకు 1,012 మంది విద్యార్థులు హాజరు కాగా 977 ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. పీజీ కోర్సులలో ప్రవేశాలకు అనువుగా ఫలితాలు వెంటనే విడుదల చేశామని తెలిపారు. యుద్ధప్రాతిపదికన సమాధాన పత్రాల మూల్యాంకనం పూర్తిచేసి ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న పవిత్ర

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గుర్రంకొండ మండలం, చెర్లోపల్లెలో చోటు చేసుకుంది. శనివారం ఉదయం కడుపునొప్పి ఎక్కువగా రావడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు గుర్రంకొండ మండలం, చెర్లోపల్లెకు చెందిన శివ భార్య పవిత్ర (26) పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఐదుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాల వద్ద దారి విషయమై జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడడంతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లి వాసి గుల్ల శ్రీనివాసులురెడ్డి తన పొలం వద్ద దారి సమస్య కారణంగా జరిగిన ఘర్షణలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులురెడ్డిని ఆయన భార్య యమున, చెల్లెలు సుజాతపై భాస్కర్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, క్రిష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచారు. దీంతో శ్రీనివాసులురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

చుక్కలు చూపిన ఏడుకొండలు ఎక్స్‌ప్రెస్

ఐదు గంటలు ఆలస్యంతో ప్రయాణికుల అసహనం



ములకలచెరువు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడుకొండలు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ప్రయాణికులకు చుక్కలు చూపించింది. ఐదు గంటల పాటు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు గుర్రై తీవ్ర అవస్థలు పడ్డారు. సాంకేతిక కారణాలతో సికింద్రాబాద్ జంక్షన్‌లో రైలు నాలుగున్నర గంటలకుపైగా ఆలస్యంగా బయలుదేరింది. దీంతో ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 7.49 గంటలకు వచ్చింది. అలాగే మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.18 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.16 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.41 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా 8.52 గంటకు వెళ్లింది. అలాగే ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరాల్సిన రైలు ఉదయం 10.14 గంటలకు వెళ్లింది. రైలు తీవ్ర ఆలస్యంగా నడవడంతో రైల్వేస్టేషన్లలో రైలు కోసం గంటల తరబడిగా వేచి చూసి అసహనానికి గురయ్యారు.

ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు


కలెక్టర్ నుంచి స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

రాయచోటి(నేతాజీ సర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులకు శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో క్రెడిట్ యాక్సెస్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మదనపల్లెకు ఏ. పూజిత, ములకలచెరువుకు చెందిన పీ. తేజస్విని , చౌడేపల్లి కి చెందిన బీ. రెడ్డిరాణి, కదిరికి చెందిన ఎస్. సాధక్, బీ. కొత్తకోటకు చెందిన పీ. పల్లవి ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ తరపున డివిజనల్ మేనేజర్ జగదీశ్, ఏరియా మేనేజర్ హనుమంతయ్య, సుంకన్న, బ్రాంచ్ మేనేజర్ మదుసూధన్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఏపీ లిక్విడ్ స్ప్రేతో మంచి దిగుబడులు

జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ


రైతులకు వేప మొక్కలను అందజేస్తున్న జేడీఏ శివనారాయణ

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పైరుకు డీఏపీ చల్లకుండా లిక్విడ్‌తో స్ప్రే చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం బీ.యర్రగుడి పంచాయతీలోని చెంచర్లపల్లి, యర్రగుడి, మామిడిగారిపల్లెల్లోని వేరుశనగ, కంది, ఆముదం పంటలకు డీఏపీ లిక్విడ్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విస్కో కంపెనీ వారు డీఏపీని స్ప్రేగా విక్రయిస్తున్నారని, దీనిని ప్రతి రైతు ఉపయోగించుకోవచ్చునన్నారు. వేరుశనగ, ఆముదం, కంది, వరి, ఇతర పైర్లకు డీఏపీ లిక్విడ్ స్ప్రే చేసుకోవచ్చునన్నారు. రైతు పొలం గట్టున మొక్కలు నాటుకుంటే ఎంతో ఉపయోగకరమని 200 వేప మొక్కలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏవో రాజాకుమారి, ఏఈవో అనూష, ఆర్‌ఎస్‌కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వరికోత యంత్రం బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

బి.కొత్తకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తుమ్మణంగుట్ట సమీప జాతీయ రహదారిపై వెళుతున్న వరికోత యంత్రం బోల్తాపడింది. శనివారం సాయంత్రం వెళుతున్న యంత్రం పైనుంచి 15 అడుగుల కిందికి రోడ్డుపైకి పడిపోవడంతో డ్రైవర్ గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించి మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం జగన్ కాలనీకి చెందిన మంగమ్మ మిద్దెపై దుస్తులు ఆరవేస్తూ శనివారం కిందపడింది. దీంతో తలకు గాయమై స్పృహ కోల్పోయింది. వెంటనే కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్సను అందించిన డాక్టరు ఆమె పరిస్థితి విషమంగా ఉందని ఎక్కడికైని తీసుకెళ్లాలని చెప్పారు. అయితే వారి ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో ఇక్కడ ఐసీయూలోనే ఉంచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

కొత్తగా.. పరీక్షలు

- ప్రశ్నపత్రాల స్థానంలో బుక్‌లెట్లు
- నూతన విధానానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం
- ఒత్తిడి తగ్గించాలంటున్న ఉపాధ్యాయ సంఘాలు

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. విద్యార్థులకు కనీసం ప్రశ్నపత్రాలు అందించలేని దుస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు బోర్డులపై ప్రశ్నలు రాస్తే వాటిని విద్యార్థులు ఎక్కించుకుని పరీక్షలు రాసేవారు. కనీసం సుద్దముక్కకు కూడా డబ్బులు ఇవ్వని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ప్రశ్నపత్రాల స్థానంలో బుక్‌లెట్లు ప్రవేశపెట్టింది. అయితే ఈ విధానంతో తమకు పనిభారం పెరిగి బోధన సమయం తగ్గిపోతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రశ్న సమాధాన పత్రాలకు స్వస్తి పలికి బుక్‌లెట్ విధానాన్ని తీసుకొచ్చింది. ప్రతి సబ్జెక్టుకు స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టింది. 1 నుంచి 10వ తరగతి వరకు నూతన పరీక్ష విధానాన్ని అమలు చేస్తున్నారు. పరీక్షలన్నీ బుక్‌లెట్‌లోనే రాయాలి. ప్రశ్నలు, జవాబులకు సరిపడా బుక్‌లెట్‌లో పేజీలు కేటాయించింది. సోషల్‌కు మ్యాపులు, గణితానికి గ్రాఫ్‌లు, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు సంబంధించిన ఓఎంఆర్ షీటు అన్నీ అందులోనే ఉంటాయి. విద్యార్థుల అపార్ ఐడి నెంబర్, పూర్తి వివరాలు, ప్రశ్నపత్రం కోడ్, పరీక్ష సమయం అందులో ఉంటాయి. ఎఫ్‌ఏలు నాలుగు, ఎస్‌ఏలు రెండు పరీక్షల తేదీలతో పాటు బుక్‌లెట్‌లో ఉంటాయి. ఈ బుక్‌లెట్ ఆధారంగా విద్యార్థుల ప్రగతి సామర్థ్యాన్ని ఉన్నతాధికారులు అంచనా వేస్తారు. దీనిని బట్టి విద్యార్థులకు ఏ బీ సీ డీ కేటగిరీలు కేటాయిస్తారు. నూతనంగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానాన్ని ఉపాధ్యాయులు స్వాగతిస్తూనే పని ఒత్తిడి తగ్గించాలని కోరుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానం బాగుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

బుక్‌లెట్‌తో మంచి ఫలితాలు రావు



పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకం అనే విధానం కొత్త సమస్యలకు దారితీస్తుంది. దీని వలన పాఠశాల పనివేళలో బోధన సమయాన్ని హరించే విధంగా ఉంది. దీనితో పాఠశాలలో మూల్యాంకనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడి బోధనా సమయానికి అంతరాయం ఏర్పడుతుంది. మార్కుల నమోదు, ఆన్‌లైన్ నమోదు, రిజిస్టర్ల నమోదుతో పాటు బబ్లింగ్ చేసే పనికూడా ఉపాధ్యాయులకు ఇచ్చారు. ఉపాధ్యాయునికి ఈ విధానం కష్టమవుతుంది.

- టి.ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పరీక్షలు విద్యార్థులకా? ఉపాధ్యాయులకా?



ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు విద్యార్థులకో లేక ఉపాధ్యాయులకో అర్థం కావడం లేదు. ప్రతి విద్యార్థికి సంబంధించిన అంశాలను ఉపాధ్యాయుడే రాయాలని చెప్పడం వలన పరీక్షలు ముగిసిన తర్వాత రోజుల తరబడి మూల్యాంకనం చేసుకోవడానికే సమయం సరిపోతుంది. దీని వలన బోధన అటకెక్కే పరిస్థితి ఏర్పడింది. పరీక్ష పత్రాలన్నీ స్కాన్ చేసి అప్‌లోడ్ చేయమనడం వల్ల ఇప్పటికే అనేక బోధనేతర కార్యక్రమాలతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఇది మరింత భారంగా మారింది.

- పాలెం మహేశ్‌బాబు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

గురువుపై దిద్దుబాటు బరువు



ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెస్తున్నా కొన్ని అంశాలు ఉపాధ్యాయులకు మరికొన్ని అంశాలు విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరీక్ష విధానంలో విద్యార్థుల స్థాయికి మించిన ప్రశ్నలు ఇచ్చారు. విద్యార్థుల జవాబు పత్రం మూల్యాంకనం చేసి వాటి మార్కులను ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ చేసే విధంగా ఉపాధ్యాయులకు పనిపెట్టడం చాలా ఇబ్బందిగా ఉంది. ఈ విధానం మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఉపాధ్యాయులను కేలం బోధనకే పరిమితం చేయాలి.

- ఎస్.రామాంజనేయులు, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

పని విభజన సర్దుబాటు చేయాలి



విద్యాశాఖలో జరుగుతున్న సంస్కరణలతో పాటు పని విభజనను కూడా సర్దుబాటు జరగాలి. అసెస్‌మెంట్ బుక్‌ల ద్వారా పరీక్షలు, మూల్యాంకనంతో పనిభారం ఎక్కువైంది. తదనుగుణంగా పరీక్షలు, మూల్యాంకనం, బోధన, సిలబస్‌పై కూలంకుషంగా చర్చించి పని రోజుల సంఖ్యను విభజించాలి. ఉపాధ్యాయులు ఆన్‌లైన్ చేస్తున్నప్పుడు ఆఫ్‌లైన్‌ను రద్దుచేయాలి. అసెస్‌మెంట్ పుస్తకాలతో పరీక్షల విధానాన్ని పునఃసమీక్షించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు


ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి : కలెక్టర్


స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో కలెక్టర్ శ్రీధర్

కలకడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులకు సూచించారు. శనివారం కలకడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ప్రతి నెలా మూడవ శనివారం జిల్లా వ్యాప్తంగా జరుగుతుందన్నారు. గత మాసాంతం నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున జనావాసాల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, జ్వరాలు ప్రబలడంతో పాటు అంటువ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. వీటి నివారణ చర్యల్లో భాగంగా ప్రతి పంచాయతీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలు, పంచాయతీ సచివాలయాలు, పారిశుధ్య సిబ్బంది సమిష్టిగా ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించేలా కృషి చేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని తెలిపారు. అనంతరం బస్టాండు వద్ద ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కాగా జాతీయ రహదారి పక్కనే మురికినీటి నిల్వను గమనించిన కలెక్టర్ స్వయంగా స్ప్రే చేసి పంచాయితీరాజ్ శాఖాధికారులు, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ అధికారి దయాకర్‌రెడ్డి, తహశీల్దార్ మహేశ్వరిబాయి, ఎంపీడీవో జగదీశ్వర్, ప్రతాప్‌రెడ్డి, ఏపీవో సుజాత, సర్పంచ్ విశ్వనాథ్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్నానికే సబ్ కలెక్టరేట్ ఖాళీ

- మధ్యాహ్నం 3 గంటలకు సీట్లన్నీ ఖాళీ
- పనుల కోసం వచ్చిన ప్రజల బేజారు


మధ్యాహ్నం 3 గంటకు ఖాళీగా కనిపిస్తున్న సబ్‌కలెక్టరేట్

మదనపల్లె టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సబ్‌కలెక్టరేట్ కార్యాలయం 11 మండలాలు, 10 లక్షల మంది ప్రజలకు రెవెన్యూ సేవలందిస్తుంటుంది. అటువంటి ఈ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించడం లేదు. వివిధ రెవెన్యూ సేవల కోసం వచ్చే ప్రజలకు ఇక్కడి ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం జరిగనప్పటి నుంచీ ఇక్కడి ఉద్యోగులు పనివేళల్లో, వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. కానీ శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో సబ్‌కలెక్టరేట్‌లో ఉద్యోగుల సీట్లన్నీ ఖాళీగా కనిపించాయి. కార్యాలయంలోకి ఎవరు వెళ్లినా అక్కడ సమాధానం ఇచ్చేవారు లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మినిస్టీరియల్ ఉద్యోగులు ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉంది. వీరు వచ్చిన వెంటనే బయోమెట్రిక్ హాజరు వేసుకుని, సాయంత్రం 5.30 గంటల వరకు విధులు నిర్వహించాల్సి వుంది. మధ్యలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల లోపు ఎప్పుడైనా అరగంట పాటు భోజన విరామం ఉంటుంది. ఇది ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో మినిస్టీరియల్ సిబ్బంది విధిగా అమలు చేయాల్సిన నిబంధన. కానీ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో మాత్రం కొందరు ఉద్యోగులు వారికి ఇష్టమొచ్చినప్పుడు రావడం, టీలకు, భోజనాలకు అంటూ సమయపాలన మరిచి బయటకు వెళుతున్నారు.

కనీసం వీరి సీట్లను వదలి వెళ్లేటప్పుడు విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు కూడా ఆఫ్ చేయకుండా వెళ్లిపోతున్నారు. ఇది వారి నిర్లక్ష్యానికి తార్కాణమనే చెప్పవచ్చు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న సబ్‌కలెక్టర్ కళ్యాణి సబ్‌కలెక్టరేట్ ఉద్యోగులను ఒక గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై సబ్‌కలెక్టర్ కళ్యాణి వివరణ ఇస్తూ ఇక్కడి ఉద్యోగులు మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు భోజనానికి వెళ్లి ఉండవచ్చని, కొందరు తనతో పాటు రాయచోటిలో ఆర్బిట్రేషన్ కేసుల విషయమై వచ్చారని చెప్పారు.

వచ్చే ఏడాది మెడికల్ కాలేజి ప్రారంభించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల నిర్మాణం ఆగింది కాసుల కోసమేనని, 2026 సంవత్సరానికి కాలేజి ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మదనపల్లెలో కొత్తగా నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాల భవనాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2022లో వైసీపీ ప్రభుత్వంలో కొత్త మెడికల్ కళాశాలలు మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పులివెందులలో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇందులో భాగంగా మదనపల్లె రూ.472 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు ఆలస్యం కావడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.12 కోట్లతో తాత్కాలిక భవనాలకు నిధులు మంజూరు చేశారు. ఇందులో రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపినా అందులో కనీసం కోటి రూపాయల విలువైన పనులు కూడా జరగలేదని ఆరోపించారు. గతంలో పనులు మెగా కంపెనీకి కేటాయించగా రెండు కళాశాలల భవనాలు ప్రారంభించారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణాలు ఆపేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది బదిలీ చేసి మదనపల్లె ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు హరిశర్మ, శ్రీరాములు, రామమూర్తి, రాజు, కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయ, ఉద్యానశాఖ సంయుక్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాజేంద్రప్రసాద్, గీతావాణి తనిఖీలు నిర్వహించారు. యూరియా నిల్వ ఉంచిన గోడౌన్‌ను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, అందుకు సంబంధించిన యూరియా నిల్వలను ఉంచాలని ఎరువుల దుకాణం యజమానులకు తెలియజేశారు. ఎరువుల అమ్మకాలు వాటి సంబంధించిన రసీదులను పరిశీలించారు. అక్రమంగా యూరియా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సురేశ్, పీసీ సుధాకర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ చేసిన సబ్ కలెక్టర్


రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ భావన

రాజంపేట టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం రైల్వేకోడూరు రోడ్డులోని ఎరువుల దుకాణాన్ని శనివారం సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు వివరాలను పరిశీలించారు. నిర్ణయించిన ధరల మేరకే ఎరువులను అందజేయాలని అలా కాకుండా అదిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పీరుమున్నీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో...

నందలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో శనివారం డిప్యూటీ తహసీల్దారు మోహన్‌కృష్ణ, మండల వ్యవసాయాధికారి మల్లికార్జున తనిఖీలు చేశారు.

యూరియాను నిర్దేశిత ధరకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరగాలి

రాయచోటిటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా ఎదగడం భారతీయులందరికీ గర్వకారణమని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శనివారం డైట్ ప్రాంగణంలో డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ శివశక్తి అనే ప్రదేశంలో సురక్షితంగా దిగిందన్నారు.

ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సంగా నిర్ణయించిందన్నారు. అంతరిక్ష ప్రయోగాలపై పిల్లలు, యువతలో ఆసక్తి పెంపొందించడానికి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇస్రో యువిక (యంగ్ సైంటిస్ట్)- 2025 అనే కార్యక్రమం నిర్వహిస్తోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోస్టర్ల తయారీ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గిరిబాబు యాదవ్, శివప్రసాద్, తిరుపతి శ్రీనివాస్, కేదార్నాథ్, మోహన్‌నాయక్, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

కడప, అగస్టు 23 : పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్సనందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన, ఎస్.పి. బంగళా ఎదురుగా హరితా హోటల్ ఎ.పి. టూరిజం నందు, ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమవారం రెండురోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబరులో సంప్రదించాలన్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ..

● మితిమీరుతున్న ఆక్రమణలు

● చోద్యం చూస్తున్న అధికారులు

వైసీపీ నేతల భూకబ్జా



కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనూ వైసీపీ నేతలు భూ ఆక్రమణలకు తెగబడుతున్నారు. అడ్డు చెప్పేవారు లేకపోవడంతో వైసీపీ ఆక్రమణల పర్వం ఇంకా కొనసాగుతుంది. దీనికి అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల ద్వారా కొద్దో గొప్పో లబ్ధి పొందడం వల్ల స్వామిభక్తి చాటుకుంటున్నట్లు సమాచారం. అందుకే ఆక్రమణల గురించి తెలిసినా పట్టించుకోవడం లేదని చర్చ సాగుతుంది. ఎవరైనా ప్రజలు ఫిర్యాదు చేస్తే తప్ప రెవెన్యూ అధికారుల్లో చలనం కనిపించడం లేదనేది స్పష్టమవుతుంది. ఇటీవల కమలాపురం మండలంలో కూడా ప్రజలు ఫిర్యాదు చేసిన తరువాతనే అది ప్రభుత్వ భూమి అని, అక్కడ ఎవరూ ఆక్రమించుకోరాదు అంటూ ఒక బోర్డును పాతిపెట్టారు. అంతవరకు ఆ భూములు వైసీపీ నాయకులు తమ సొంత భూములుగా భావించి వనాలు తయారు చేసుకున్న పరిస్థితి. జిల్లాలో దాదాపు ప్రతి మండలంలో గత ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలు జరిగాయన్నది బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఇవి అలాగే ఉన్నాయి. ప్రజలు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తే తప్ప ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి భూములు బయటపడే పరిస్థితి లేదు.

ప్రభుత్వం మారినా..

ప్రభుత్వం మారినా వైసీపీ నాయకులు భూఆక్రమణలు కొనసాగిస్తూనే ఉన్నారు. కడప నగరంలో భూముల ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ఎక్కడ ఏ కొంత ఖాళీ జాగా కనిపించినా పాగా వేస్తున్నారు. కొంత మంది నకిలీ పత్రాలు తయారు చేసుకుని స్వాహా పర్వానికి తెరలేపుతున్నారు. తాజాగా కడప నగరంలోని మూడో డివిజన్‌లో వైసీపీ నాయకుడు ఒకరు ప్రభుత్వ భూమిలో భవనాల నిర్మాణం సాగిస్తున్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఏర్పడిన ఆర్‌కే నగర్ సమీపంలో ఇతర కాలనీలు వెలిశాయి. ఇక్కడ గతంలో కొంతమంది నిరుపేదలకు స్థలాలు కేటాయించారు. అందులో కొంతమంది గృహాలు నిర్మించుకోగా మరికొంత స్థలం ఖాళీగా ఉండేది. ఈ కళాశాల స్థలాల్లో వైసీపీ నాయకులు ప్రస్తుతం భవనాలను నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో స్థలం పొందిన వారు వచ్చి అడ్డు చెబితే మీకు ఇచ్చిన స్థలాలు రద్దయిపోయాయి అంటూ బుకా యించడంతో పాటు దౌర్జన్యాలకు దిగి స్థలాలు ఆక్రమించుకుని భవనాలు నిర్మిస్తున్నట్లు సమా చారం.

కడప రింగు రోడ్డుకు ఆనుకుని ఉన్న బైపాస్ రోడ్డు పక్కన ఉన్న ప్రాంతంలో పేదల కాలనీలో గల ప్రభుత్వ స్థలం కొంత స్థలం ఆక్రమించి యథేచ్ఛగా బిల్డింగులు నిర్మిస్తున్నారు. దీనికి కొందరు రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జగన్ ప్రభుత్వంలో భూ ఆక్రమణలు, భూ కబ్జాలతో ప్రజలు విసిగిపోయారు. దీంతో ప్రజలు వైసీపీకి తగిన బుద్ధి చెప్పారు. కూటమికి జై కొట్టారు. ఈ ప్రభుత్వంలో కూడా వైసీపీ నాయకులు ఏ మాత్రం తగ్గకుండా యథేచ్ఛగా ప్రభుత్వ భూములు ఆక్రమించి బిల్డింగులు నిర్మిస్తున్నా అధికారుల్లో చలనం కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మరికొంత మంది అధికారులు మామూళ్ల మత్తులో ప్రజల భూములను భూఆక్రమణదారులకు ధారాదత్తం చేస్తున్నట్లు సమాచారం. మరికొంత మంది రెవెన్యూ సిబ్బంది భవిష్యత్తులో ప్రభుత్వం మారితే తమను ఇబ్బంది పెడతారేమో అనే భయంతో పట్టించుకోకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే చర్చ సాగుతుంది. ఈ పరిస్థితుల్లో రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి భూ ఆక్రమణదారుల కబంధ హస్తాల నుంచి ఆక్రమిత భూములు కాపాడాలని కోరుతున్నారు. అదేవిధంగా కడప నగరం మూడో డివిజనులోని పేదల కాలనీలో అక్రమంగా వైసీపీ నాయకులు ఆక్రమించి నిర్మాణం చేస్తున్న భవనాలను కూల్చి ప్రభుత్వ భూమికి కంచెను ఏర్పాటు చేసి బోర్డు పెట్టవలసిందిగా ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కడప తహసీల్దారును ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



ఆక్రమణదారులు నిర్మిస్తున్న గృహాలు

మెడికల్ ఏజన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు

ముద్దనూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ మెడికల్ ఏజన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ దస్తగిరి వివరాల మేరకు.. నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉప్పలూరు గ్రామానికి చెందిన పరమేశ్వరరెడ్డి దాదాపు 4 ఏళ్లుగా ఆరోగ్య మెడినీడ్స్ మెడికల్ ఏజన్సీ నడుపుతున్నాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలో మెడికల్ షాపు యజమాని పెనుజూరి శ్రీధర్‌కు మెడిసిన్ పంపిణీ చేస్తానని రూ.99 లక్షలు తీసుకున్నాడు. రూ.3లక్షలకు మెడిసిన్ పంపించగా, మిగిలిన రూ.96లక్షలకు ఇవ్వాల్సి ఉంది. బాధితుడు శ్రీధర్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేశామని, ఏజన్సీ నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఏజెన్సీ నిర్వాహకుడు అనంతపురం, ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల్లోని కొన్ని మెడికల్ ఏజన్సీల నుంచి మందులను తెచ్చి జమ్మలమడుగు, కోవెలకుంట్ల ఇతర ప్రాంతాల్లోని మెడికల్ షాపులకు మందులు విక్రయించేవాడని, మెడికల్ షాపు చూపిస్తూ చాలా మంది వద్ద డబ్బులు అప్పు తీసుకున్నట్లు సమాచారం. అప్పు ఇప్పించిన మధ్యవర్తులకు నూటికి రూ.20 కమీషన్ ఇచ్చేవాడని, మధ్యవర్తుల ద్వారా కోట్లు అప్పు తీసుకున్నట్లు తెలిసింది. 10 రోజుల నుంచి ఏజన్సీ నిర్వాహకుడు కనిపించకుండా పోయాడని, మొబైల్ కూడా ఇంట్లో పెట్టి వెళ్లినట్లు సమాచారం. దీంతో అప్పులు ఇచ్చిన వారిలో ఆందోళన రేగుతోంది.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి పవిత్రోత్సవాలు ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. సాయంత్రం 6 గంటలకు మేదిని పూజ, అంకురార్పణ ఘట్టాలు నిర్వహించారు. యాత్రికుల వల్ల కాని, సిబ్బంది వల్ల కాని తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానివ్వకుండా నిర్వహించేందుకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈనెల 24న యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, 25న పవిత్ర సమర్పణ, 26న వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ అధికారి హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు వీణారాఘవాచార్యులు, శ్రావణకుమార్, మనోజ్‌కుమార్, పవన్‌కుమార్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభలవీడులో భూమి విషయమై ఘర్షణ



బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు సిద్దారెడ్డి

బి.కోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభలవీడు గ్రామం సర్వేనెం.895 భూమి విషయమై వైసీపీ నాయకులు టీడీపీ నాయకుడు సిద్దారెడ్డిపై శనివారం సాయంత్రం మూకుమ్మడి చేశారని బాధితుడు తెలిపారు. ప్రభలవీడు గ్రామ రెవెన్యూ పొలంలో సర్వేనెం.895 భూమిలో శ్మశానానికి, వైసీపీ నాయకులకు, టీడీపీ నేత సిద్దారెడ్డి సోదరికి భూములు ఉన్నాయి. కాగా శనివారం వైసీపీ నాయకులు వారి పొలానికి సర్వే చేయిస్తుండగా టీడీపీ నేత సోదరి అక్కడికి వెళ్లడంతో వైసీపీ నాయకులు సిద్దారెడ్డితో ఘర్షణ పడి దాడికి పాల్పడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వైసీపీకి చెందిన నాయకులు నాగిరెడ్డి సుబ్బిరెడ్డి, సుబ్బలక్షుమ్మ, జయమ్మ, లక్ష్మీదేవిలు కలిసి తనపై విచక్షణారహితంగా దాడి చేశారని, తనను గ్రామస్థులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి చేర్చారన్నారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు వెళ్లినట్లు బాధితుడు తెలిపారు. కాగా ఈ విషయమై బీకోడూరు ఎస్ఐ వెంకటసురేశ్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సిద్దారెడ్డి తెలిపారు.

నేడు గంధం మహోత్సవం

కడప కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ప్రసిద్ధిగాంచిన కడప అమీన్‌పీర్ దర్గాలో ఆదివారం గంధం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 10వ పీఠాధిపతి హజరత్ ఖాజా సయ్యద్‌షా అమీనుల్లా మహ్మద్ మహ్మదుల్ హుసేని చిష్టివుల్ ఖాద్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేస్తున్నట్లు తెలియజేశారు. 25న తహలీల్‌తో పాటు ఉరుసు రోజున ఖవ్వాలి కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. అన్నివర్గాల ప్రజలు గంధం, ఉరుసు మహోత్సవాలు విజయవంతం చేసేందుకు తరలిరావాలని కోరారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

● 26 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకేదిన్నె మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం శుక్రవారం సాయంత్రం నుంచి సీకే దిన్నె మండలంలోని మద్దిమడుగు ఫారెస్టు సెక్షన్‌లో స్థానిక అటవీ సిబ్బంది షకీల్ అహ్మద్, నారాయణరెడ్డితో కలిసి కూంబింగ్ చేపట్టారు. కోలుములపల్లి సమీపంలో కొంతమంది కారుతో కనిపించారు. చుట్టుముట్టేందుకు ప్రయత్నించగా కొందరు పారిపోగా, ముగ్గురు దొరికారు. పరిసర ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలు లభించాయి. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను, కారును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంచురీ ప్యానల్స్ పరిశ్రమ తనిఖీ



కెమికల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

గోపవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కు వద్ద నిర్మించిన సెంచురీ ప్యానల్స్ పరిశ్రమను శనివారం ఆర్డీవో చంద్రమోహన్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వారు వాడే పదార్థాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, అగ్రికల్చర్ ఏడీతో పాటు బద్వేలు ఎంఈవో సెంచురీ ప్యానల్‌ను సందర్శించి వివరించారు. పరిశ్రమలోని హెచ్‌పీఎల్ ఎండీఎస్ ప్లాంట్లను సందర్శించారు. పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



భానుప్రకాష్ (ఫైల్)

లింగాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి భానుప్రకాష్ (22) శనివారం నంద్యాల జిల్లా పాణ్యం ఇంజనీరింగ్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడు ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రులు రాంభూపాల్, సరస్వతిలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కడప క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దేవునికడపకు చెందిన యల్లనూరు ప్రనుష్‌కుమార్‌రెడ్డి (14) శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై కూర్చుని ఉండగా వేగంగా వస్తున్న మరో వాహనం ఢీకొనడంతో ఆ బాలుడు బ్రిడ్జి మీద నుంచి నీటిలో పడి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, మృతుడి తండ్రి నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రూ.45 కోట్లతో మఠం అభివృద్ధికి శ్రీకారం: ఎమ్మెల్యే



కమిషనరుతో కలిసి మఠం ఆవరణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి వహించిన దేవస్థానాన్ని రూ.45 కోట్ల నిధులతో త్వరలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శనివారం మఠం దేవస్థానాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం తీర్థయాత్ర పునరుజ్జీవనం ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి డ్రైవ్ (ప్రసాదం) కేంద్ర ప్రయోజిత పథకం కింద నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మఠాన్ని ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, తాత్విక, సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆలయ ప్రాంగణంలో ముఖ్యంగా వెయ్యిమంది భక్తులు బస చేసేందుకు షెడ్డు ఏర్పాటు చేస్తామని, రోడ్డు వెడల్పు, డ్రైనేజీ ఏర్పాటు, పోలేరమ్మ గుడి, కక్కయ్య గుడి అభివృద్ధి, బ్రహ్మంగారి నివాసం వీధి, రచ్చబండ, అలాగే వేదపాఠశాల, బి.మఠం దేవస్థానం ఆలయం చుట్టూ లైటింగ్ మాడవీదులుగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనరు రామచంద్రమోహన్, డిప్యూటీ కమిషనరు పట్టెం గురుప్రసాద్ కలిసి మఠంలో ఇప్పటివరకు నూతనంగా నిర్మాణం చేపట్టిన కళ్యాణ మండపం, డార్మిటరీ భవనాలను పరిశీలించారు. త్వరలోనే అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనరు మల్లిఖార్జునప్రసాద్, దేవదాయశాఖ అధికారి శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ సాంబశివారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, సర్పంచ్ నారాయణ, మేకల సుధాకర్, మల్లె బాలక్రిష్ణ, శీలం నరసింహగౌడ్, బాలగౌడ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

● అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు

కడప కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖలు సంయుక్తంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులు ప్రథమ బహుమతిని దక్కించుకున్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన క్విజ్ పోటీలను కడపలోని బాలికల జూనియర్ కళాశాలలో జరిగాయి. క్విజ్ పోటీల అనంతరం జిల్లా అదనపు డీఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణపై దేశ వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనాభాలో హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులు గురించి పరిజ్ఞానం, అవగాహన పెంపొందించడానికి, సురక్ష పద్ధతులు పాటించడం, వివక్ష అనే అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో స్వచ్ఛందంగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించుకొనేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విజేతలను రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతోందన్నారు. శనివారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో జమ్మల మడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థికి ప్రథమ బహుమతి రాగా రెండవ బహుమతి యర్రగుంట్ల జూనియర్ కళాశాలకు, తృతీయ బహుమతి పులివెందుల వైఎస్ వీఆర్ఎం కళాశాల విద్యార్థులకు లభించాయి. విజేతలందరికీ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నగదు బహుమతి వారి సొంత ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రోగ్రాం మేనేజరు భాస్కర్, వీవీ ప్రసాద్, సాదిక్, సిలార్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు

● అధిక యూరియాతో పంటకు నష్టం

● జేడీఏ చంద్రానాయక్

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులు పక్కదారి పట్టకుండా పటిష్టమైన నిఘా, ఆకస్మిక దాడుల కోసం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు చంద్రానాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు పక్కదారి పట్టకుండా రైతన్నకు అందేలా అన్ని రకాల పటిష్ఠమైన గట్టి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో ఎనిమిది వ్యవసాయ శాఖ డివిజన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో వ్యవసాయ శాఖ నుంచి ఏడీఏ, పోలీసు శాఖ నుంచి ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ శాఖ నుంచి పీటీవో స్థాయి అధికారులతోపాటు టెక్నికల్ ఏవో, స్థానిక వ్యవసాయ శాఖ అధికారి ఉంటారని వివరించారు. వీరు ఎరువుల దుకాణాలపై ప్రత్యేక నిఘాతో పాటు మెరుపు దాడులు చేసేలా ప్రణాళికను తయారు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 20 శాతం మాత్రమే ఖరీఫ్ సీజన్‌లో సాగైనట్లు ఈ-పంట గణాంకాలు చెబుతున్నాయన్నారు. వర్షాలు ఇప్పుడిప్పుడే పడడంతో రైతన్నలు సాగుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, త్రీటౌన్ సీఐ వేణుగోపాల్, బీసీటీవో ఖాజామొహిద్దీన్, ఏవో వరహరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రొద్దుటూరు పట్టణంలోని ఎరువుల దుకాణంపై శనివారం సాయంత్రం విజిలెన్స్ అధికారుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. స్థానిక ఎరువులు, డీలర్ల దుకాణాల్లో స్టాక్ నిలువలు, రికార్డులను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ జేడీఏ చంద్రానాయక్ నేతృత్వంలో ఏడీఏ అనిత, ఎ.వేణుగోపాల్, డీసీటీవో ఖాజామొద్దీన్, ఏవో వరహరికుమార్‌ల బృందం పట్టణంలోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్, కేవీఎస్ఆర్ హోల్‌సేల్ ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఇన్‌వాయిస్‌లు పరిశీలించారు. కమర్షియల్ ట్యాక్స్ అధికారులు దుకాణ క్రయవిక్రయాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని తేల్చిచెప్పారు. యూరియాతో పాటు ఏ ఇతర వస్తువుల కొనుగోలుపై రైతులను ఒత్తిడి చేయకూడదని వివరించారు.



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఎస్‌టీయూఫ్ డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయి రిలీవర్ లేక పాతస్థానాల్లోనే పనిచేస్తున్న ఉపాధ్యాయులను రిలీవ్ చేసి బదిలీ అయిన కొత్త స్థానాలలో చేరే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాసులు, బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం కడప నగరం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ తుపాకుల మురళి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నంద్యాల రాజగోపాల్‌రెడ్డి, జిల్లా గౌరవ సలహాదారులుక్రిష్టఫర్ జాన్, జిల్లా కార్యదర్శి ఆలమూరు ప్రసాద్, బాలకృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ సాధనకు జరిగే ధర్నాను జయప్రదం చేయండి

యూటీఎఫ్ పిలుపు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలంటూ విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్ విధానాన్ని 2004 సెప్టెంబరు 1 నుంచి నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే 2003లో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఫలితాలను వెల్లడించినప్పటికీ ప్రభుత్వమే నియామక ఉత్తర్వులు ఇవ్వడంలో ఆలస్యం చేసిందని తెలిపారు. ఈనెల 25వ తేదీసోమవారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహరావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ హితానికి మట్టి గణపతులు దోహదం



కడప కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మట్టితో తయారు చేసిన బొజ్జ గణప య్య విగ్రహాలు పర్యావరణానికి ఎంత గానో దోహదపడగలవని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య (ఏపీపీబీ ఎస్), జనసేన నాయకులు సూచించారు. శనివారం ఆర్‌కేనగర్‌లో గల శనీశ్వరస్వామి ఆలయంలో ప్రజలకు మట్టివిగ్రహాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్యగౌరవాధ్యక్షుడు చంద్రమౌళీశర్మ, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ, జనసేన నాయకులు జీవీ రమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ దక్షిణాంధ్ర సంయోజకులు ఎం.మేఘన, నగర ప్రముఖులు ఏటూరు రామచంద్రారెడ్డి, సమైఖ్య ప్రతినిధులు జగదీశ్ హరయూర్, నరసింహ భట్టర్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కోసం పాటుపడదాం





చెన్నూరు, కమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చెన్నూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కోసం అందరం పాటుపడాలని అలాంటప్పుడే మనం, మన ఊరు, మన రాష్ట్రం బాగుండి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుందని ఎంపీడీవో గంగాదేవి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లోభాగంగా చెన్నూరులో మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధివైపు నడవాలంటే ఆరోగ్యంగా ఉండాల న్నారు. ఇందుకోసం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవసరమన్నారు. ఎక్కడ మనిషి ఆరోగ్యంగా ఉంటారో అక్కడ అభివృద్ధి ఉంటుందని అన్నారు. ప్రతిరోజూ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడం, భోజనం తరువాత మరలా శుభ్రం చేసుకోవడం, టాయిలెట్ వెళ్లిన తరువాత కూడా చేతులు శుభ్రతను పిల్లలకు నేర్పించాలన్నారు. అనంతరం చెన్నూరులో పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి స్థానిక పాత బస్టాండు కూడలిలో మానవహారం చేశారు. అలాగే పరిశుభ్రత కోసం అందరం పాటుపడాం, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రగా మార్చుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీఐ క్రిష్ణారెడ్డి, ఎంఈవో గంగిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, పంచాయతీ కార్య దర్శి రామసుబ్బారెడ్డి, మండల కన్వీనరు విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఏపీవో శైలజ, అంగన్వాడీ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపెడుతున్నామని నగర పంచాయతీ కమిషనరు ప్రహ్లాద తెలిపారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం పారిశుధ్య కార్మి కులతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్, రెవెన్యూ ఆర్‌అండ్‌బీ, మెడికల్, హెల్త్, ఇరిగేషన్, ఐసీడీఎస్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంటు, మెప్మాసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన



పెండ్లిమర్రి.. అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సీకేదిన్నె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వి ద్యార్థులకు వారికి జరిగే అన్యాయాలను 1098 నంబరుకు కాల్ చేసి సహాయం పొందవచ్చునని ఐసీపీఎస్ సోషల్ వర్క ర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. కొలుములప ల్లె పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ సూ పర్‌వైజర్ లక్ష్మీదేవి, శ్రీదేవి, ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, వి ద్యార్థులు పాల్గొన్నారు.

కడప ఎన్టీఆర్ సర్కిల్..: కౌమార దశలో ఉన్న పిల్లలు ఏ పని చేసినప్పటికీ ఆలోచించి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్త పడుతూ సత్ప్ర వర్తనతో మెలగాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, మహిళా సాధికారత అధికారి రమాదేవి అన్నారు. మిషన్ వాత్సల్య పథకం చైల్డ్ హెల్ప్‌లైను గురించి శని వారం అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. అగాడివీధిలో ఉన్న ఉర్దూపాఠ శాల, జయనగర్ కాలనీలో జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలకు ఐసీడీఎస్ పీడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కడప అర్బన్ సీడీపీవో వాణి, ఏసీడీపీవో శోభారాణి, లీగల్ క్రైం ప్రొబిషన్ ఆఫీసరు సునీతరాజు, ప్రొటెక్షన్ ఆఫీసరు ప్రతిరూప్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, స్కూలు యాజమాన్యం పాల్గొన్నారు.

వేముల..: పిల్లలు ఆపద సమయాల్లో ఉన్నప్పుడు 1098 నెంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణసాయం అందుతుందని అధికా రులు పేర్కొన్నారు. శనివారం మండలం లోని గొల్లలగూడూరు హైస్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 1098 ఫోన్ నెంబర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు ఎస్.విజయ కుమారి, అంగన్వాడీ కార్యకర్త, ఉపాధ్యా యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కడప క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడప టౌన్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో టూటౌన్ సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ ఎస్‌కేఎం హుస్సేన్, మాసాపేటప్రభుత్వ పాఠశాలను సందర్శిం చి విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు, మహిళాభద్రతపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు.

సెక్యూరిటీ గార్డ్సుకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్సుకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. అదేవిధంగా ఆప్కాస్ రాష్ట్రకార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవి, పవన్ ఒక సంయుక్త ప్రకటనలో జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. రూ.18600 వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.7వేల నుంచి రూ.8వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు.

రేపు వేంపల్లెలో జిల్లాస్థాయి యోగా పోటీలు

వేంపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఈ నెల 25న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా అసోసి యేషన్ జిల్లా ప్రెసిడెంట్ అనిల్, కార్యదర్శి తేజ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి స్థానిక శ్లోక స్కూల్‌లో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ పోటీల్లో స్త్రీ, పురుషులు, బాల బాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. 8 ఏళ్ల నుంచి 45 సంవత్సరాల వరకు ఆయా గ్రూపుల్లో ఈ యోగా పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటా రని తెలిపారు. సెప్టెంబరు 6, 7 తేదీల్లో ఈస్ట్‌గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో ఈ రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 9440470064, 6301612190 నెంబర్లను సంప్రదించా లన్నారు.

బోదకొట్టం దగ్ధం

సీకేదిన్నె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపు రం గ్రామంలో ప్రమాదవశాత్తు పాలెం నరసింహులుకు చెం దిన బోదకొట్టం కాలిపోయింది. శనివారం శ్రావణమాసం సం దర్భంగా ఇంటిలో దీపం పెట్టి కూలి పనికి వెళ్లడంతో బోదకొ ట్టం కావడంతో ఇంటిలోకి కోతులు దూరి దీపం కిందపడవే యడంతో దీపం మంటలు అంటుకుని బోదకొట్టం కాలిపో యింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.50 వేలకుపైగా ఆస్తిన ష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ రద్దుచేయాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని మాలమహానాడుజాతీయ అధ్యక్షుడు ఆర్‌ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. శనివారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు శరత్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాలను పరిశీలించిన ఆర్డీవో

పెండ్లిమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాలను శనివారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ పరిశీలించారు.మోక్షం ఎప్పుడు.. ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రిక లో వచ్చింది.దీనితో స్పందించిన మంత్రి నారా లోకేశ్ సెప్టెంబరు 2వ తేదీన నూతన కళాశాల భవనాలను ప్రారంభించనున్నట్లు ఆర్డీఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనూరాధ, టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి,ఆర్ఐ శ్రీనివాసులుతదితరులు పాల్గొన్నారు.

జ్వరం ఉన్నవారికి రక్తపూతలు సేకరించాలి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సింహాద్రిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు మొదలయ్యే అవకాశాలు ఉన్నందున ఆరోగ్య కార్యకర్తలు గ్రామంలో పర్యటించి జ్వరాల బారిన పడినవారి రక్తపూతలు సేకరించి వారానికి రెండు సార్లు ల్యాబ్‌కు అందజేయాలని మలేరియా సబ్-యూనిట్ అధికారి సిద్ధయ్య సూచించారు. బుధవారం మండలంలోని బిదినంచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గురిజాల గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆరోగ్య విస్తరణాధికారి సుకుమార్, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సీహెచ్‌ఓ లీలా, ఆశాలు పద్మావతి, రాజరంగమ్మ పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆంజనేయస్వామి ఆలయాలు



పులివెందుల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం పురస్కరించుకొని పులివెందుల పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తూర్పు ఆంజనేయ స్వామి, పడమర ఆంజనేయస్వామి, అభయ ఆంజనేయ స్వామి, కొండ ఆంజనేయస్వామి ఆల యాలకు భక్తులు తరలివెళ్లి మొక్కుకున్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అంజన్నను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.కాగా పులివెందుల సమీపంలోని కదిరి రోడ్డు కొండపై వెలసిన అభయ ఆంజనేయస్వామిని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి, మాజీ సర్పంచు ఉమాదేవి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజచేసి కాయకర్పూరం సమర్పించారు. అన్నదానకార్యక్రమంలో పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలే లక్ష్యం : ఎమ్మెల్యే



కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించడమే ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవిరెడ్డి అన్నారు. శనివారం కడప నగరపరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ప్రాంగణంలో గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ ప్రారంభం కావడం వల్ల ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి,వైద్య సముదాయాల అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు,ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాసుల, సూపర్ స్పెషాలిటీ అడ్మినిస్ట్రేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు

పెండ్లిమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్‌ఎం సరస్వతి తెలిపారు.మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం 1098 కి కాల్ చేయడం పై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కల్పన,శంషాద్,టీచర్లు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన పెంచుకోవాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళకు కొండంత అండగా శక్తి యాప్ ఉంటుందని కడప మహిళా పోలీసుస్టేషన్ సిబ్బంది అన్నారు. కడప జయనగర్‌కాలనీలో ఉన్న బాలికోన్నత పాఠశాలలో శనివారం శక్తిటీం ఇన్‌ఛార్జ్ ఇన్‌స్పెక్టరు, సిబ్బంది ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి ,100, 112, 181లకు సమాచారం ఇవ్వాల న్నారు. కార్యక్రమంలో స్కూలు సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు

వేంపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ నరసింహులు హెచ్చరిం చారు. నాలుగురోడ్ల కూడలిలో శనివారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధ నలు తప్పక పాటించాలన్నారు. వినాయక మండపాలు ఏర్పాటుచేసుకునే వారు ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు.

నీతి, నిజాయితీకి నిలువుటద్దం టంగుటూరి

వేంపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): టంగుటూరి ప్రకాశం పంతులు నీతి, నిజాయితీ, నిర్భీతి, ధైర్య సాహసాలకు మారుపేరని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కొనియాడారు. శనివారం వేంపల్లెలో ప్రకాశం పంతులు జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

ఆచరణాత్మక రాజకీయ దృక్పథం సురవరం సొంతం: ఆచరణాత్మక రాజకీయ దృక్పథం భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి సొంతమని తులసిరెడ్డి కొనియాడారు. కాగా ఆయన మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు.

బీజేపీ చేతిలో జగన్ కీలుబొమ్మ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన రాధాకృష్ణన్‌కు మద్దతు ఇవ్వాలని వైసీపీ నిర్ణయించడం ద్వారా జగన్ నిజస్వరూపం బయటపడిందని తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. తన కేసుల కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం, రాష్ట్ర ప్రయోజనాలను జగన్ తాకట్టుపెడతాడని మరోసారి తేలిపోయిందని తులసిరెడ్డి అన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు దరఖాస్తు చేసుకోవాలి

చెన్నూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి పరిశుభ్రతలో భాగంగా మండల వ్యాప్తంగా వ్యక్తిగత మరుగుదొడ్లులేని వారంతా ఏర్పాటు చేసుకోవాలని ,ఇందుకోసం ప్రభుత్వం రూ.15వేలు నిధులు మంజూరు చేస్తుందని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరులో శనివారం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇంకా చాలా చోట్ల వ్యక్తిగత మరుగుదొడ్లులేవని, ఇందుకోసం ప్రభుత్వం ఎన్ని అవసరం అయితే అన్ని పరిమిత సంఖ్య లేకుండా మంజూరు చేస్తున్నదని అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కానీ, ఎంపీడీవో కార్యాలయం, లేదా సచివాలయంలో దరఖాస్తు చేసుకుని పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కడప సెవెన్ రోడ్స్ ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఆహారం అందించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటల్స్, బేకరీలు,స్ట్రీట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం కడపలో జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

అన్ని జాగ్రత్తలతో మండపాలు ఏర్పాటుచేసుకోవాలి

వేముల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటుచేసుకున్న మండపాలలో అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ రెడ్డిలక్ష్మి తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వినాయక మండపాల నిర్వాహకులకు, పోలీసులతో కలిసి తహసీల్దార్ సమావేశం ఏర్పాటుచేశారు. ఆమె మాట్లాడుతూ ఎలాంటి అల్లర్లకు దారి తీయకుండా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలన్నారు. ముందస్తు ప్రమాద నివారణచర్యలను తీసుకోవాలన్నారు. నిమజ్జనం సమయంలో నిబంధనలు పాటించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై ర్యాలీ

పెండ్లిమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నందిమండలం ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధులపై శనివారం సచివాలయ,ఆరోగ్యశాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రమాదేవి,శశికళ సూపర్‌వైజర్లు రవీంద్రనాథ్ ,వెంకటసుబ్బమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులే కీలకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి

కడప సెవెన్ రోడ్స్ ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు నిర్మాతలు విద్యార్థులే అని,ఉన్నత లక్ష్యాలతో చదివి దేశాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించాలని యోగి వేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి అన్నారు. శనివారం కడపలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో ప్రస్తుత సమాజం-విద్యార్థుల పాత్ర అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి, శివ, నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కడప క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యువతకు భవిష్యత్తుపై కొత్త ఆశలను రెకెత్తిస్తూ డ్రగ్స్‌రహిత సమాజమే లక్ష్యంగా డ్రగ్స్ వద్దు బ్రో.. అనే నినాదంతో నగరంలోని సెయింట్‌జోసెఫ్ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప పోలీసుల కళా జాగృతి బృందం,నార్కోటిక్ సెల్, ఈగల్ సిబ్బంది తమ కళారూపాల ద్వారా, వాస్తవ పరిస్థితులను వివరించడం ద్వారా విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసమూర్తి, ఎస్‌ఐ లక్ష్మీదేవి, నార్కోటిక్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇది కోతల ప్రభుత్వం : అంజద్ బాషా

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఇది కూటమి ప్రభుత్వం కాదు కోతల ప్రభుత్వమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష విమర్శించారు. ప్రతి పథకంలో కోతలు వినిపించడం ఈ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని తెలిపారు. వైకల్య పింఛన్లు తొలగించేందుకు వాళ్లకి మనసెలా ఒప్పిందని ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి భ్రుత్వం ప్రజలకు చేసింది శూన్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రం చేసిన జిల్లా పోలీసులు

కడప క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వంఎంతో ప్రతిష్టా త్మకంగా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రారంభించింది. శనివారం పోలీసులు సర్కిల్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్ ఆవరణంలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. కలుపు మొక్కలు, అధికారులు సిబ్బంది అందరూ పాల్గొని శుభ్రం చేశారు.

మహిళల భద్రత కోసమే 1098 హెల్ప్‌లైన్

బి.కోడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా భద్రత కోసమే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు సుగుణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మేకవారిపల్లె జిల్లాపరిషత్ హైస్కూలులో 1098పై విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. అంతేకాకుండా బాల్యవివాహాలు, బాలకార్మికుల గురించి అనాథ పిల్లలు, వీధిలో వదిలేసిన పిల్లలు ఎవరైనా ఉంటే వెంటనే పై నెంబరుకు ఫోను చేసి సమాచారం అందించాలన్నారు.

పీడీలుగా ఎర్రగుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు డీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటారు. పాఠశాలలో చదివిన వై.చంద్రకాంత్ 3వ ర్యాంకు, ఎస్.తాజుద్దీన్ 20వ ర్యాంకు, ఎస్.ఆరిఫ్ మహమ్మద్ 25వ ర్యాంకు, కె.జగదీష్‌కుమార్ 46వ ర్యాంకులు సాధించి తమ సత్తాచాటారు. విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినందుకు పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయ బృందం వారికి అభినందనలు తెలిపారు.

పర్యావరణానికి మొక్కల పెంపకం తోడ్పాటు



మొక్కలు నాటుతున్న దృశ్యం

బద్వేలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి మొక్కల పెంపకం తోడ్పాటు నందిస్తుందని డీవైఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు. బద్వేలు పట్టణ కమిటీ పట్టణంలోని సీమాంక్ ఆసుపత్రి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం డీవైఎఫ్ఐ బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, శ్రీచక్ర హాస్పిటల్ డాక్టర్ చక్రధర్‌రెడ్డి , యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్‌లు హాజరై వారి సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ లతాదేవి, ఉపాధ్యాయినిలు శారద, ఖైరున్నీసా, షకీరా, భారతి, లక్ష్మీదేవి, లలిత, చెన్నమ్మ, సీమాంక్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ సమస్యలపై పోరాడుతాం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై పోరాడుతామని ప్రొద్దుటూరు గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. శనివారం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా కటారి పీరయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటనారాయణ, సభ్యులుగా సునీత, హనుమంతు, నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సంఘం సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

రక్తదానం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 23 (ంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడడానికి యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని డీఆర్‌వో విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఓంశాంతి భవన్ ప్రథమ అధ్యక్షురాలు రాజయోగిని ప్రకాశమణి దాదీ పుణ్యతిథిని పురస్కరించుకుని విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రక్తదానం చేశారు. విజయనగరం వీధిలోని ఓంశాంతిభవన్‌లో నిర్వహించిన రక్తదానం శిబిరంలో 85 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా శాంతా బెహెన్‌జీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఒకేసారి ఓంశాంతి భవన్‌లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు.

ఇష్టారాజ్యంగా అక్రమ లేఅవుట్లు

● బద్వేలులో 70 ఎకరాల్లో 16 అక్రమ వెంచర్లు ● గుర్తించిన అధికారులు ● విక్రయిస్తే చర్యలు తప్పవంటున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో బద్వేలులో ఇష్టారాజ్యంగా అక్రమ లే అవుట్లు వెలిశాయి.. రియల్‌ఎస్టేట్ పేరుతో కొందరు దందా సాగించారు. అనుమతులు లెక్క చేయకుండా లే అవుట్లు వేసి అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు వేశారు. ఇలాంటి వెంచర్లు, అక్రమాలపై కూటమి ప్రభుత్వం వచ్చి రాగానే చర్యలకు ఉపక్రమించిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వాటిపైచర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారన్న విమర్శలున్నాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భూ ఆక్రమణలు, అక్రమ లే అవుట్లపై చర్యలు ఉంటాయనుకున్నా ఆ స్థాయిలో అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తుండడంపై పలు విమర్శలకు తావిస్తోంది. బద్వేలులో దాదాపు 70 ఎకరాలలో 16 అక్రమ లే అవుట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే వాటిపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. బద్వేలు పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి స్థలాలకు గిరాకీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో బద్వేలు, గోపవరం మండలాలలో అక్రమంగా యథేచ్ఛగా ఇష్టానురాజ్యంగా వెంచర్లు వేసినట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి వెంచర్లను పరిశీలిస్తే గోపవరం మండలం మడకలవా రిపల్లెలోని 795/2 సర్వేనెంబరులో మూడు ఎకరాలలో అక్రమ లే అవుట్లు వెలిశాయి. బద్వేలు మండలంలోని 1156-1, 1156-2, 1156-3, 3.34 ఎకరాలు, అలాగే గుంతపల్లె మండలంలోని సర్వే నెంబరు 614-1ఎ, 1బి, 1సి, 1డి, 1ఈ, 630, 631, 632, 633, 634, 635, 636, 637-1.24లతో పాటు చెన్నంపల్లెలోని 1580లో 16.5 ఎకరాలు, గుంతపల్లెలోని 628లో 2.48 ఎకరాలలో అనధికార లే అవుట్లు వెలిశాయి



అనధికార లే అవుట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఈ అక్రమ లే అవుట్లపై అధికారులు ఏవిధమైన చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

అక్రమ లే అవుట్లపై చర్యలు తప్పవు

అనధికార అక్రమ లే అవుట్లలో స్థలం లేదా ప్లాట్లు వేసినా చట్ట విరుద్ధమని వాటిపై చర్యలు తప్పవు. ప్లాట్ల అమ్మకం, కొనుగోలు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయబడవు. ఎలాంటి భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయబడవని, అనధికారికంగా లే అవుట్లు వేసి అమ్మకాలు చేస్తే స్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

-నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, బద్వేలు

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు

జమ్మలమడుగు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ హెచ్చరించారు. జమ్మలమడుగు పట్టణంలో శనివారం ఆర్డీవో సాయిశ్రీ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దనూరు రోడ్డులోని శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ఆర్డీవో తనిఖీ చేసి ఎరువుల దుకాణం యజమానితో మాట్లాడారు. రైతులకు ఎరువుల కొరత లేకపోయినా దుకాణాలవారు కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తే వారి వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువులు పాత స్టాక్ ఇచ్చి రైతులకు ఇబ్బంది కలిగించరాదన్నారు. ఎరువుల దుకాణాల వారు బల్క్‌గా యూరియా, ఇతర మందులు పక్కనపెట్టుకుని రైతులకు ఇవ్వకుండా ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవన్నారు. ఇక నుంచి ప్రతిరోజు తనిఖీలు తప్పవన్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఎరువుల యజమానులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

మైదుకూరు రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్, జిల్లా రీజనల్ విజిలెన్స్ ,ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల మేరకు మైదుకూరు పట్టణంలోని యూరియా దుకాణాలపై పోలీస్, అగ్రికల్చర్, విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు.స్థానిక నంద్యాల రోడ్డులోని ఎరువుల దుకాణాలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. రికార్డు రాయకుండా ఉన్న యూరియా బస్తాలను అధికారులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు చంద్రనాయక్, ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో బాలగంగాధర్‌రెడ్డి, సీఐ రమణారెడ్డి, విజిలెన్స్ సీఐ శివన్న పాల్గొన్నారు.



ధరల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు సంజీవరెడ్డి

దువ్వూరులో: దువ్వూరులోని రసాయనిక ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న అంగళ్లను శనివారం మండల తహసీల్దారు సంజీవరెడ్డి పరిశీలించారు. స్థానికంగా ఉన్న మన గ్రోమోర్, జైకిసాన్‌తోపాటు ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే శ్రీ వెంకటేశ్వర, గోదా, కాశినాయన దుకాణాలు తనిఖీ చేశారు. వారి వద్ద స్టాక్ రిజిస్టర్లతోపాటు అమ్మకాలు, నిలువల ధరలు తదితర విషయాలను పరిశీలించారు. కొందరు అమ్మకాల రిజిస్టర్లు సరిగా నిర్వహించని విషయాన్ని గమనించి రిజిస్టర్‌లో సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీ విషయాన్ని తెలుసుకుని ప్రొద్దుటూరు రూట్‌లోని ఒక ఎరువుల అంగడి మూసివేసి యజమాని వెళ్లిపోయిన విషయాన్ని అధికారులు గమనించారు. తహసీల్దారు వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాన్సన్ పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: వ్యవసాయాధికారులు విజిలెన్స్ అధికారులు పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఎరువుల దుకాణాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని రూ.6,33,350 విలువ చేసే ఎరువుల సీజ్ చేశారు. శనివారం పోరుమామిళ్లలో విజిలెన్స్‌అధికారులు, వ్యవసాయాధికారులు సీఐశ్రీనివాసులు, వ్యవసాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డి, వ్యసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డిలు ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. పవన్ ఆగ్రో ఏజన్సీ , వీఎస్ ఫెర్టిలైజర్స్ దుకాణాలు తనిబఖీచేసి సరైన పత్రాలు లేని ఎరువులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకుడు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఎరువులు కొన్న తరువాత రశీదులు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్‌రఫి, సాంకేతిక వ్యవసాయాధికారి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు

బద్వేలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. శనివారం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ఆయన తన జీవితాన్ని కార్మికవర్గ అణగారిన వర్గాల పోరాటాలకు అంకితం చేశారన్నారు. ప్రజలకోసం జీవితాంతం పోరాడిన ఆయన చేసిన పోరాటాలు గుర్తుండిపోతాయన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, కేసీ బాదుల్లా, బాలు, మునెయ్య, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

బద్వేలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే ఆరోగ్యంగా ఉంటామని ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు పేర్కొన్నారు. ప్రతి నెలా 3వ శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కోటవీధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు వివిధ శాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించడం, మంచినీటి ట్యాంకులను శుభ్రపరుచుకోవడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బద్వేలు అర్బన్ సీఐ లింగప్ప, తహశీల్దారు ఉదయ భాస్కర్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) :కాలానుగునంగా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ డేవిడ్ రాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థులు వారు ఉన్న ప్రదేశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ప్రనకాశ్‌రావు, అధ్యాపకులు సులోచన పర్వీన్ పాల్గొన్నారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో: పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈవో ఓబులేసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరులో:పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర లక్ష్యమని ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి పాత బస్టాండులో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు,ఏపీవో గంగయ్య,ఈవో నరసింహులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ప్రొద్దుటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేఎస్‌సీ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం ప్రాణాలకు ప్రమాదమన్నారు. సెల్‌ఫోన్ లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలే కాదు ప్రాణ నష్టమన్నారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి, కళాశాల అద్యాపకులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌ను ప్రక్షాళన చేస్తాం



మార్కెట్‌లో పర్యటిస్తున్న కొండారెడ్డి

ప్రొద్దుటూరు , ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తాత్కాలిక కూరగాయ మార్కెట్‌లో అక్రమాలు చోటు చేసుకున్నాయని వాటన్నింటిని ప్రక్షాళన చేస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనయుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మార్కెట్‌ను కలియతిరిగారు. కోనేటి కాల్వ వీధిలో ఉండగా మార్కెట్‌లో షెడ్లు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, మున్సిపల్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రాజేష్, ఏఈ దస్తగిరి కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి మాజీ కౌన్సిలర్ జయలింగారెడ్డి జంబాపురం రామాంజనేయరెడ్డి, కూరగాయల మార్కెట్ అసోసియేషన్ నాయకుడు జొన్నవరం షబ్బీర్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మారుతీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రొద్దుటూరు లో మరో రెండు అన్న క్యాంటీన్లు ఏర్పాటుకు స్థలాలు చూడాలని ఆయన కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆదేశించారు. శనివారం స్థానిక విజయ్‌కుమార్ సర్కిల్లోగల అన్నక్యాంటీన్‌ను కొండారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి భోజన నాణ్యతను పరిశీలించారు.

31న చేతివృత్తిదారుల సదస్సు

బద్వేలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారుల సదస్సును ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు చేతివృత్తిదారుల సంఘం నేతలు తెలిపారు. పట్టణ కవిటీ ఆధ్వర్యంలో బద్వేలులో కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ చేతివృత్తిదారులకు 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇవ్వాలని, సబ్సిడి రుణాలు ఇవ్వాలని , దాడులను అరికట్టాలని ఆయన పేర్కొన్నారు.

విగ్రహాలు నెలకొల్పేవారు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ భావన, సీఐలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు అర్బన్, రూరల్ పరిధిలో వినాయక విగ్రహాలు నెలకొల్పేవారు నిబంధనలు పాటించి తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని డీఎస్పీ భావన సూచించారు. శనివారం స్థానిక త్రీటౌన్ పోలీసుస్టేషను ఆవరణలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలతో కలిసి ఉత్సవ విగ్రహ కమిటీ నేతలతో డీఎస్పీ భావన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉత్సవ కమిటీలు సింగల్ విండో సిస్టమ్ ద్వారా వెబ్‌సైట్‌లోకి వెళ్లి మొబైల్ నెంబరుతో ఓటీపీ ద్వా రా అప్లికేషన్ సబ్‌మిట్ చేయాలన్నారు. కనీసం ఐదుమంది సభ్యులుగా ఏర్పడి గుర్తింపు కార్డులు పోలీసులకు చూపించి అనుమతి పొందాలన్నారు. స్థల అనుమతి పంచాయతీ మున్సిపాలిటీ అనుమతి తప్పని సరి వుండాలన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. ఊరేగింపు సమయాల్లో ఇతర కులాలు మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదన్నారు. నిమజ్జనం కోసంవెళ్లే వాహనాలు కు లైసెన్సు రిజిస్ట్రేషన్ ఉండాలన్నారు. సమావేశంలో ఒన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డి, టూటౌన్ సీఐ సదాశివయ్య, త్రీటౌన్ సీఐ వేణుగోపాల్, రూరల్ సీఐ బాలమద్దిలేటి పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకొందాం



పండుగ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

మైదుకూరు రూరల్, ఆగస్ట 23(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగను సంతోషంగా, ప్రశాంతంగా జరుపుకొందామని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో మైదుకూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో వినాయక చవితి పండుగను నిర్వహించుకొనే ఉత్సవ నిర్వాహక కమిటీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ విగ్రహాలను నిలిపేందుకు ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. విగ్రహం వద్ద, వినాయ నిమజ్జనం వెంట కాని డీజేలను పెట్టవద్దని తెలిపారు. నిమజ్జనం రోజున విగ్రహాల వద్ద ఆకతాయిలు అల్లరి చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రమణారెడ్డి, ఎస్‌ఐ చిరంజీవి, వినాయక ఉత్సవ విగ్రహాల కమిటీ అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో వినాయక చవితి సందర్భంగా మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో వినాయక విగ్రహాల మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగ ఈనెల 27వ తేదీ ప్రారంభం కానుందని మూడు రోజుల నుంచి అయిదు రోజులు, 10 రోజులు విగ్రహాలు కొలువుదీర్చేవారు అయిదు మందికి తగ్గకుండా కమిటీ ఏర్పాటు చేసుకుని ఆర్గనైజింగ్‌వారి పేర్లు ఇవ్వాలన్నారు. విగ్రహాలు ఎక్కడ పెడుతున్నారు, నిమజ్జనం చేసే తేదీ, ఊరేగింపులు, రూట్లు, ఊరేగింపు చేసే వాహనం తదితర వివరాలు వినాయక విగ్రహం మండపం వద్ద పొందుపరచాలన్నారు. ఎవరైనా మండపాలు పెట్టుకున్నట్లతే ఆన్‌లైన్ దరఖాస్తులపైన విచారించి క్యూఆర్ కోడ్ ఇస్తారన్నారు.

కొండాపురంలో: వినాయక చవితి పండుగను, నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని మండల అధికారులు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం వినాయక ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాల అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. విగ్రహ ఏర్పాట్లలో, నిమజ్జనంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా కమిటీ వారే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగప్రసాద్, తహసీల్దార్ గురప్ప, ఎస్సై ప్రతాప్‌రెడ్డి, ఫిషరీస్ అసిస్టెంట్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత కామనూరుకు ఆర్టీసీ రైట్ రైట్

● పల్లె వెలుగు బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

దువ్వూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు నుంచి కామనూరు మీదుగా నడిచేందుకు పల్లె వెలుగు బస్సును శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రారంభించారు . ఈ రోడ్డుమీదుగా పదేళ్ల నుంచి ఆర్టీసీ బస్సు నడవడంలేదు. ప్రైవేటు బస్సుల హవా కొనసాగుతున్న నేపథ్యంలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే నిమిత్తం ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకుని పల్లె వెలుగు బస్సును ఏర్పాటు చేయించారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన దువ్వూరు, మురళీనగర్, నేలటూరు, ఎర్రబల్లె, కామనూరు, నక్కలదిన్నె ప్రాంతాల మహిళలు హర్షం వెలిబుచ్చుతున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, రాంబాబు, అందె శ్రీనివాసులు, పోలు రామమోహన్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సెప్టెంబరు 13వ తేదీన జరిగే లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఇష్టపూర్వకంగా వారి వారి కేసులను ఎలాంటి ఖర్చు, ఇబ్బందులు లేకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. అందుకు సంబంధిత కక్షిదారులు స్థానిక పోలీసు స్టేషన్లలోని పోలీసు అధికారులతో ఇష్టపూర్వకంగా వెళ్లి కేసులు పరిష్కారం కోసం ఒప్పుకుని కోర్టుకు హాజరై కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం అయితే సుప్రీంకోర్టులో కేసు పరిష్కారం అయినట్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు, ఎస్ఐలు, బార్ అసోసియేషన్ సెక్రటరి మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ సాగు రైతులకు లాభదాయకం

కాశినాయన ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):పామాయిల్ సాగు రైతులకు మంచి లాభదాయకమై పంటఅని ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామంలో ఉద్యాన శాఖ, ఆయిల్ ఫామ్ సంయుక్తంగా ఆయిల్ ఫామ్ సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహనా కల్పించారు. ఈసందర్భంగా ఉద్యానశాఖాధికారి మాట్లాడుతూ పామాయిల్ పంట నాటుకునే రైతులు ఎకరాకు 50 మొక్కలు నాటుకోవచ్చన్నారు .పంటతొలిదశలో స్వల్పకాలిక పంటలైన కూగాయలు, పప్పుదాన్యాలు సాగుచేసుకోవచ్చన్నారు. సబ్సిడీతో డ్రిప్, నీటి వసతి కోసం పొలంలో పారంపాండ్స్ తవ్వకొనుటకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మొక్కలు ఉచితంగా ఇవ్వడంతోపాటు హెక్టారుకు మెయింటెనెన్స్ కింద 4సంవత్సరాలకు కలిపి రూ.21 వేలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.శారద, ఏఈవో రవి, పలువురు రైతులు క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

రాజుపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన వెల్లాలగ్రామంలోని ఎస్సీ కాలనీకి పర్లపాడు బీటీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు రోడ్డు నిర్మాణానికి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి రూ.3.50లక్షలు నిధులు మంజూరు చేశారని వెల్లాల ఎంపీటీసీ ప్రభావతి తెలిపారు. గత కొన్నిరోజులుగా ఈ దారిలో వర్షం నీరు నిల్వ ఉండి కంపచెట్లతో ఇబ్బందిగా మారిందన్నారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.50లక్షలు మంజూరు చేయడంతో రోడ్డు నిర్మాణానికి త్వరలో పనులు చేపడతామన్నారు. పనుల్లో ఆటంకాలు రావడంతో జమ్మలమడుగు పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామచంద్రనాయక్ ఈ రోడ్డును పరిశీలించి అనుమతులు ఇచ్చారన్నారు. దీంతో త్వరలో రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెల్లాల భాస్కర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లకు నిధులు

దువ్వూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు దువ్వూరులో శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ వాటి నిర్మాణానికి సంబంధించిన పనుల పరిపాలనకు లబ్ధిదారులకు మంజూరు పత్రం అందజేశారు. మండలంలోని 25 మరుగుదొడ్లకు సంబంధించి ఒక్కొక్కదానికి రూ.15వేలు చొప్పున నిధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామక్రిష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివకుమార్, టీడీపీ మండల కన్వీనర్ రమణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణమాస పూజలు

బద్వేలు రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం అభిషేక పూజలతో శ్రావణమాస పూజలు ముగిశాయి. అనంతరం స్వామి అమ్మవార్లకు పలు రకాల కూరగాయలతో చేసిన ప్రత్యేక అలంకరణలో భక్తులకు కన్నులపండువగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కైంకర్యం రాజుపాలెంకు చెందిన రాజేంద్రవర్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

పంచముఖ ఆంజనేయస్వామికి విశేష పూజలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా పట్టణంలోని పెన్నానది తీరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వెండి కవచాలు, రంగు రంగుల పూలమాలలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగురాళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ సేవలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో హెచ్చెం నర్సింహ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే డబ్బులు పొదుపు చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం స్వర్ణదంసన్న అధ్యక్షుడు కిరణ్ క్రిష్ణప్రసాద్, బ్యాంకు సిబ్బంది శంకరయ్య ఎం.రాఘవేంద్రుడు, రవి శంకర్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.